

కొద్ది రోజుల క్రితం ఎండిపోయిన మేహాద్రిగెడ్డ రిజరాయర్



ప్రస్తుతం నిండుకుండను తలపిస్తున్న మేహాద్రి రిజర్వాయర్

నగర ప్రజల దాహార్తిని తీర్చే మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నెల రోజుల క్రితం బీడువారింది. వర్షాకాలంలోనూ వరుణుడు కరుణించకపోడంతో నీరులేక పూర్తిగా ఎండిపోయి వెలవెలబోయింది. ఇటీవల కురిసిన వర్షాలతో మేహాద్రి ప్రస్తుతం జలసిరితో కళకళలాడుతోంది. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి అధికంగా వరద నీరు మేహాద్రికి చేరడంతో నిండుకుండను తలపిస్తోంది.

- పెందుర్తి

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం


ఈవోకు చెక్కు అందిస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎండాడకు చెందిన చింతల అప్పలనాయుడు రూ.లక్ష 116, చింతల రామకృష్ణ రూ.లక్ష, చింతల మురళీకృష్ణ రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందించారు. చెక్కులను సింహగిరిపై దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకి ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

అప్పన్న సన్నిధిలో రఘునంద్


శేషవస్త్రంతో డాక్టర్ రఘునంద్‌ని సత్కరిస్తున్న ఏఈఓ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఏపీ వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ రఘునంద్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంను ఏఈవో తిరుమలేశ్వరరావు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో సినీ నిర్మాత సాయి కొర్రపాటి


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సాయి కొర్రపాటి

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామిని ప్రముఖ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సాయి కొర్రపాటి సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అధికారులు అందజేశారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 12 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.1.20 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై టీడీపీ ఎంపీటీసీ ఆవేదన

పరవాడ: తానాంగ్రామంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం పాల్గొన్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తనను ఆహ్వానించకుండా అధికారులు ప్రొటోకాల్‌ను అతిక్రమించడం దురదృష్టకరమని గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత గోపాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఎంపీటీసీగా ఉన్న తనకు కార్యక్రమ సమాచారం తెలపకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

కాసుల వేటలో.. టౌన్ ప్లానింగ్

- జోన్-8లో అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్న టౌన్ ప్లానింగ్ విభాగం
- ప్లాన్‌లు లేకపోయినా నిర్మాణాలు.. కన్నెత్తి చూడని అధికారులు
- ప్రభుత్వ స్థలాలు, రోడ్డు ఆక్రమించినా ప్లాన్ ఇప్పిస్తున్న కార్యదర్శులు
- జీవీఎంసీ ఆదాయానికి భారీ గండి


చినముషిడివాడ పాతూరులో స్థానిక టౌన్ ప్లానింగ్ కార్యదర్శి అండతో రోడ్డు స్థలంలో చేపడుతున్న నిర్మాణం


సుజాతనగర్ 80 అడుగుల రోడ్డులోని ఎమ్మెల్యే పంచకర్ల కార్యాలయానికి కూతవేటు దూరంలో జరుగుతున్న అక్రమ నిర్మాణం

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8లో అక్రమ నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పరస్పరం సహకరించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రజాప్రతినిధుల అండతో పక్కా'ప్లానింగ్'తో అధికారులు జీవీఎంసీ ఆదాయాన్ని అడ్డగోలుగా దోచుకుంటూ, వారి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎక్కడికక్కడ తప్పుడు ప్లాన్‌లు, ప్లాన్‌కు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలున్నా.. పట్టించుకున్న పాపాన పోవట్లేదు. ఈ అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయట్లేదంటే టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు ఎలా ఉందో.. అర్థం చేసుకోవచ్చు.

ఎమ్మెల్యే కార్యాలయానికి కూతవేటు దూరంలో

జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ 80 అడుగుల రోడ్డులో ఎమ్మెల్యే పంచకర్లకు చెందిన జనసేన పార్టీ కార్యాలయం ఉంది. దానికి సమీపంలోని పార్కు వద్ద సచివాలయం-504 పరిధిలో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. దీని పైఅంతస్తుకు అనుమతి లేదు. అయినప్పటికీ ఈ నిర్మాణాన్ని ఎమ్మెల్యే అనుచరులే దగ్గరుండి మరీ చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అనేకసార్లు స్థానికులు ఫిర్యాదులు చేసినా టౌన్ ప్లానింగ్ సిబ్బంది అటుగా కన్నెత్తి చూడట్లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఓ జనసేన నాయకుడి అండతో స్థానిక సచివాలయ ప్లానింగ్ కార్యదర్శితో పాటు జోన్-8లోని ఓ ప్లానింగ్ ఉన్నతాధికారి ఈ నిర్మాణంపై ఈగ వాలకుండా చూస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

> కూటమి ప్రభుత్వంలోజీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అనుమతులు రాని భవనాలు టౌన్ ప్లానింగ్ యంత్రాంగానికి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సచివాలయాల టౌన్ ప్లానింగ్ కార్యదర్శుల నుంచి ఉన్నతాధికారుల వరకు 'మామూళ్లు'గా మిన్నకుండిపోతున్నారు. ఇందుకు జోన్-8లో ఇటీవల జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలే నిదర్శనం.

మేయర్ ఇలాకాలో నడిరోడ్డు మీద!

ఇక జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న 96వ వార్డు పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం ఎదురుగా ఓ టీడీపీ నాయకుడు ప్లాన్ లేకుండా భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నాడు. సచివాలయం-519 పరిధిలోని బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని ఉన్న హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంపై ఈ నిర్మాణం యథేచ్ఛగా జరుగుతోంది. ఈ నిర్మాణ ప్లాన్ కోసం కనీసం దరఖాస్తు కూడా చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టీడీపీ నాయకుడు కావడం, మేయర్ అండదండలు పుష్కలంగా ఉండడంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని ప్రచారం జరుగుతోంది. ఈ అక్రమ నిర్మాణంపై నోటీసులు ఇచ్చేందుకు కూడా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆసక్తి చూపకపోడం గమనార్హం. ఈ ప్రభుత్వంలో కంచే చేను మేసిన చందంగా ఉంది.. అధికారుల తీరు. కూటమి ప్రజాప్రతినిధులతో కలిసి టౌన్ ప్లానింగ్ యంత్రాంగం జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని నిర్మిస్తున్న వాణిజ్య సముదాయంపై మాకూ ఫిర్యాదు అందింది. ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుని అనుమతి వచ్చేవరకు పనులు నిలుపుదల చేయాలని చెప్పాం. సుజాతనగర్ భవనంపై విచారణ చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– రామలింగారెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, జోన్-8

నేడు వైఎస్సార్ వర్ధంతి

పరవాడ: స్థానిక సంతబయలులో మంగళవారం ఉదయం 8 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని రామారావు కోరారు.

వెన్నల ప్రసాద్‌కు అదీప్‌రాజ్ పరామర్శ


అనారోగ్యంతో బాధపడుతున్న ప్రసాద్‌ను పరామర్శిస్తున్న అదీప్‌రాజ్

సబ్బవరం: గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని అమృతపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త వెన్నల ప్రసాద్‌ను నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. ప్రసాద్ నివాసానికి సోమవారం వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, పార్టీ నాయకులు బైలపూడి రామారావు, సన్యాసయ్య, శ్రీనివాసరావు, కాసు కుమార్, శ్రీరాములునాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

- 45 సాంస్కృతిక, విద్యాపరమైన అంశాల్లో పోటీలు


బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు, నిర్వాహకులు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న బాలోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థుల కోసం 45 రకాల సాంస్కృతిక, అకడమిక్ ఈవెంట్‌లకు సంబంధించిన బుక్‌లెట్‌లు 120 పాఠశాలలకు చేరవేశామన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవం పోటీల్లో పాల్గొనేందుకు ఎన్ఏడీ కొత్త రోడ్, సింహాచలం, నరవ, గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులను ఆహ్వానించామన్నారు. ఆయా పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 6 లోపు ఏ అంశాల్లో పాల్గొంటారో వివరంగా అందించాలని సూచించారు. ఇప్పటికే చాలా పాఠశాలల నుంచి సమాచారం వచ్చిందన్నారు. బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. బాలోత్సవం ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దివ్యాంగ పాఠశాల రోడ్డుకు నేమ్ బోర్డు


నేమ్ బోర్డు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: ఓనస్ ఫౌండేషన్ సహకారంతో మండల కాంప్లెక్స్ సమీపంలోని దివ్యాంగుల ప్రభుత్వ పాఠశాలకు ఏర్పాటు చేసిన రహదారి నేమ్ బోర్డును పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఓనస్ ఫౌండేషన్ ముందుకు వచ్చి నేమ్‌బోర్డును సమకూర్చడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులు మిఠాయిలు, స్నాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పరవాడ మండల విద్యాశాఖాధికారులు దివాకరరావు, సాయిశైలజ, పెద్దచెరువు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, మిల్క్ సొసైటీ అధ్యక్షుడు పైల సత్యనారాయణ, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరాశ్రయుడి మృతదేహానికి పోలీసుల అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహించిన పోలీస్

పెందుర్తి: పెందుర్తి పోలీసులు మానవత్వం చాటుకున్నారు. భిక్షాటన చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఓ వ్యక్తికి అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలివి.. నగరంలోని పితానిదిబ్బ ప్రాంతానికి చెందిన లంకడ సతీష్(48)కు కుటుంబ సభ్యులు లేరు. నగరంలోని వీధుల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. అతని పరిస్థితి గమనించిన సురేఖ అనే మహిళ అతడ్ని పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఆశ్రయం పొందుతున్న సతీష్ అనారోగ్యానికి గురవడంతో గత నెల 22న ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మృతి చెందారు. మృతుని వివరాల కోసం పోలీసులు ప్రయత్నించగా అతని పేరు మాత్రమే తెలిసింది. అంత్యక్రియలకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సీఐ కేవీ సతీష్‌కుమార్ సూచనతో కానిస్టేబుల్ ఎన్.గోవిందరావు ముందుకు వచ్చి అతడి అంత్యక్రియలు నిర్వహించారు.

గణపతిని దర్శించుకున్న అదీప్‌రాజ్


అమృతపురంలో గణేషుడి విగ్రహం వద్ద అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: అమృతపురంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, సీనియర్ నాయకులు బైలపూడి రామారావు, సన్యాసయ్య, శ్రీనివాసరావు, శ్రీరాములునాయుడు, నవీన్ ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు 7 వినతులు


వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 7 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

థాంగ్ టా విజేతలకు అభినందన


థాంగ్ టా విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వాసంతిదేవి

పరవాడ: స్థానిక మరిడిమాంబ కల్యాణమండపంలో మేజర్ ధ్యాన్‌చంద్ రాష్ట్రీయ ఖేల్ మహోత్సవ్-2025 పేరిట రాష్ట్రస్థాయి థాంగ్ టా చాంపియన్‌షిప్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో దీపాంజలినగర్‌లోని ఎన్టీపీసీ సింహాద్రి బాలభారతి పబ్లిక్ స్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. విభాగాల వారీగా జరిగిన పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించిన విద్యార్థులను, పీడీ షెల్టర్ జేమ్స్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతిదేవి అభినందించారు.

సామాజిక పింఛన్ల పంపిణీ


తానాంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. తానాంలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్లు రద్దు చేస్తుందన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, సర్పంచ్ రొంగలి దేవి వెంకటరమణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి.నాగరాజు, మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, వర్రి పరదేశినాయుడు, వెన్నల నరసింగరావు, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, కూటమి నాయకులు వియ్యపు చిన్న, బుగిడి రామగోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం


వివిధ పోటీల్లో విజేతలతో శంకర్ ఫౌండేషన్ జీఎం రాధాకృష్ణన్ తదితరులు

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి డీజీఎం బంగార్రాజు సోమవారం తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఫౌండేషన్ జీఎం కె.రాధాకృష్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ ప్రారంభించారు. గత నెల 20 నుంచి 26 వరకు పలు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నస్రీన్, శిరీష, డీజీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.